క్లుప్తంగా

సజ్జలను కలిసిన చింతలచెరువు



సజ్జలను సన్మానిస్తున్న సత్యనారాయణరెడ్డి

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన చింతల చెరువు సత్యనారాయణరెడ్డి శనివారం హైదరాబాద్‌లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. తన నియామకం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి చేపట్టే కార్యక్రమాలను గూర్చి వివరించారు. అనంతరం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని ఆయన ఘనంగా సన్మానించారు.

అంధకారంలో పాతూరు ఎస్సీ కాలనీ

కనిగిరిరూరల్: మున్సిపాలిటీలోని 12వ వార్డు ఎస్సీ కాలనీలో 15 రోజులుగా విద్యుత్ దీపాలు వెలగక అంధకారంలో ఉంది. కొండ కింద ఉండే ప్రాంతం కావడంతో రాత్రి వేళ విషపురుగులు సంచరిస్తున్నాయి. అంతేగాక కుక్కల బెడద తీవ్రంగా ఉంది. పారిశుధ్యం అధ్వానంగా మారియ కాలనీ వాసులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ప్రధానంగా వీధి లైట్లు వెలగక పోవడంతో పట్టణంలో ఉండి కూడా అంధకారంలో జీవించే పరిస్థితి నెల కొంది. వీధిలైట్లు వెలగక ప్రజలు పడుతున్న అవస్థలపై స్థానిక మున్సిపల్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ చింతంగుంట్ల సాల్మన్ రాజు శనివారం విలేకర్లకు తెలిపారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సీహెచ్ సాల్మన్ వెల్లడించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై మాధవరావు

హనుమంతునిపాడు: వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్సై ఎం.మాధవరావు వాహనదారులను హెచ్చరించారు. శనివారం మండల పరిధిలో కంభం–కనిగిరి రహదారిలో హనుమంతునిపాడు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు

విద్యార్థుల కోసం వాటర్ ఫ్రిజ్ అందజేత



వాటర్ ఫ్రిజ్ అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం(పామూరు): దాతలు తమ సొంత నిధులతో సమకూర్చిన వాటర్ ఫ్రిజ్‌ను కేజీబీవీ విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఎంఈవోలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి అన్నారు. శనివారం కేజీబీవీలో జరిగిన కార్యక్రమంలో పామూరుకు చెందిన గాడి నరసింహారావు రూ.10 వేల విలువచేసే ఫ్రిజ్‌ను ఎంఈవోల చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా దాతకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్.రేష్మ, సీఆర్‌పి వి.సతీష్, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.



కందిలో అంతరపంటగా సాగుచేసిన దోస



ఎగుమతికి సిద్ధంగా ఉన్న దోస

దోస.. రైతులకు ఘోష !

- కిలో దోస రూ.3 పలుకుతున్న దుస్థితి
- కందిలో అంతర పంటగా దోస సాగు
- నియోజకవర్గంలో వందల ఎకరాల్లో సాగు
- దోసకు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలం

పీసీపల్లి:

కూటమి ప్రభుత్వంలో వ్యవసాయం సంక్షోభంలో ఉంది. ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక రైతన్న కుదేలవుతున్నాడు. ఎప్పుడు చంద్రబాబు సీఎం అయినా రైతన్నలు సంతోషంగా లేరన్న మాట అక్షరాల సత్యం. ఉల్లి, టమాట, మిర్చి, పొగాకు, ధాన్యం ఇలా ఒకటేమిటి పండించిన ప్రతి పంటకు ధర లేక రైతులు అప్పుల పాలవుతున్నాడు. చివరికి వ్యవసాయం అంటేనే ఎందుకు చేయాలన్న ప్రశ్న తలెత్తుతోందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కనీసం కూరగాయల సాగైనా ఆదుకుంటుందనుకుంటే ఇది కూడా అన్నదాతలకు కన్నీరు పెట్టిస్తోంది. కూటమి ప్రభుత్వం మేలు చేయకపోగా అటు పంటలకు మద్దతు ధర ఇవ్వక, ఇటు సకాలంలో వర్షాలు పడక రైతులు పరిస్థితి దయనీయంగా తయారైంది. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు రైతులు నియోజవర్గంలో కందిలో దోసను అంతర పంటగా సాగు చేశారు. కనిగిరి మండలం తాళ్లూరు, బొమ్మిరెడ్డిపల్లి, లింగారెడ్డిపల్లి, కలగట్ల, హనుమంతునిపాడు మండలం, వెలిగండ్ల, సీఎస్ పురం, పామూరు, మండలాలతో పాటు పీసీపల్లి మండలంలోని బుడ్డారెడ్డిపల్లి, గోపాలపువారిపల్లి, వరిమడుగు, పెదఈర్లపాడు, గుంటుపల్లి చిలుకూరువారిపల్లి, కమ్మవారిపల్లి, పెద్దన్నపల్లి, తలకొండపాడు గ్రామాల్లో సుమారు 200 ఎకరాలు కందిలో దోసను సాగు చేశారు. ప్రస్తుతం కేజీ ధర రూ.3 పలుకుతుండటంతో దోస రైతులకు ఆదాయం రాకపోగా కనీసం కూలీ ఖర్చులకు రావడం లేదని బాధను వ్యక్తం చేస్తున్నారు.



కుళ్లిపోవడంతో వదిలేసిన దోసకాయలు

ఎకరాకు రూ.10 పదివేల ఖర్చు..

దోస పంటను ఎక్కువ కందిలో అంతర పంటగా సాగు చేయడంతో విత్తనాల ఖర్చులతో పాటు పెట్టుబడి కూడా ఎక్కువైందని రైతులు చెప్తున్నారు. ఎకరాకు రూ. 10 వేల వరకు ఖర్చు అయ్యిందని తెలిపారు. 60 కేజీలకు రూ.600 అమ్మితే ఖర్చులు బూడి టిక్కీకి రూ.100 లాభంలో ఉంటామన్నారు. అయితే ప్రస్తుతం టిక్కీ ధర రూ. 200–300 పలుకుతుండడంతో దోస రైతు కనీసం కూలీలకు డబ్బులు ఇవ్వలేమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు కొన్నిచోట్ల పొలాల్లోనే వదిలేశారు. మరి కొంతమంది రైతులు వచ్చిన కాడికి వస్తాయంటూ అమ్మేశారు.

దోచుకుంటున్న దళారులు..

గుంటూరు, విజయవాడ, కందుకూరు, సింగరాయకొండ నుంచి దళారులు పీసీపల్లి మండలంతో పాటు కనిగిరి హనుమంతునిపాడు, వెలిగండ్ల, పామూరు, సీఎస్‌పురం నుంచి దళారులు వచ్చి రైతుల వద్ద నుంచి పంటను తక్కువ కొన్ని అధిక ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. మార్కెట్ సౌకర్యం లేకపోవడం వల్ల తీవ్రస్థాయిలో నష్టపోయామని దోస రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కందిలో దోస కలిసి వస్తుందనుకున్నాం..



ఈ ఏడాది దోస పంట కలిసి వస్తుందనుకున్నాం. 15 ఎకరాల్లో దోస పంట సాగు చేశా. పంట అమ్మకానికి వచ్చేసరికి రేటు పూర్తిస్థాయిలో పడిపోవడంతో నష్టాల్ని చవి చూడాల్సి వచ్చింది. సకాలంలో కూలీలు రాక, సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో కొంత పంట పొలంలోని కుళ్లిపోయింది.

– మాలకొండరెడ్డి, పీసీపల్లి

ధర లేకపోవడంతో పొలంలోనే వదిలేశాను..



కూలీ ఖర్చులు కూడా రాకపోవడంతో దోసను కోయకుండా పొలంలోనే వదిలేశాం. ఒక కూలికి రూ.300 ఇవ్వాల్సి వస్తుంది. కాని రేటు లేకపోవడంతో పంట కోయలేదు. అంతేకాక పొలం చుట్టూ పందులు రాకుండా సోలార్ పెట్టి మరీ పంటను కాపాడుకున్నాం. చివరికి మద్దతు ధర లేకపోవడంతో తీవ్రస్థాయిలో నష్టపోయాం.

– రాజారెడ్డి, వరిమడుగు

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం



ఆర్థిక సాయం అందచేస్తున్న దద్దాల నారాయణ యాదవ్

- పలువురిని పరామర్శించిన దద్దాల నారాయణ యాదవ్

వెలిగండ్ల(కనిగిరిరూరల్): వెలిగండ్ల మండలంలో అనారోగ్య పరిస్థితితుల్లో ఉన్న పలువురిని వైఎస్సార్ సీపీ కనిగిరిఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పరామర్శించి ఆర్థిక సాయం అందచేశారు. మండలంలోని గుమ్మల కర్ర ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు మల్లెల నాగమ్మ, కుమ్మరికుంట చిన్నయ్యలు కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్నారు. వారిని పార్టీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్, పార్టీ నేతలతో వెళ్లి కలిసి పరామర్శించి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున సాయం చేశారు. అలాగే కార్యకర్త మన్నేపల్లి చిన్న వెంకటయ్య 20 రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి మన్నేపల్లి ఎలీశమ్మకు రూ 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని పందువ నాగుల వరంలో పార్టీ సీనియర్ నాయకుడు కంచర్ల సుబ్బారెడ్డిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, కటికల వెంకటరత్నం, తాతపుడి సురేష్, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, పల్నాటి భాస్కర్ రెడ్డి, పాపబత్తిన నాగేశ్వరరావు, శ్యామల ప్రసాద్ రెడ్డి, ముక్కు వేణుగోపాల్‌రెడ్డి, తమ్మినేని శివరామిరెడ్డి, కర్నాటి రమణారెడ్డి, గంజి రవీంద్రారెడ్డి, గోనా జేమ్స్, ఇమ్మానియేల్, గంగవరపు జయపాల్, బొబ్బా వెంకటరెడ్డి, పెరుగు తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల పరిష్కారానికి ఫ్యాప్టో చలో విజయవాడ

సీఎస్‌పురం(పామూరు): డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన విజయవాడ దర్నా చౌక్‌లో తలపెట్టిన దర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకటరామయ్య, షేక్.పాదుషా, ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జె.ఎస్. ఆనంద్‌బాబు అన్నారు. ఈసందర్భంగా శనివారం చలో విజయవాడ కరపత్రాన్ని సి.నాగులవరంలో యూటీఎఫ్ నాయకులు, అరివేములలో ఏపీటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల డీఏను ప్రకటించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 15 మాసాలు దాటినా ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు చెల్లించలేదన్నారు. ఉపాధ్యాయులందరూ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్.నాయబ్ రసూల్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.సాంబశివరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.



ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

వెంకయ్య, అశోక్‌రెడ్డిలకు సన్మానం



మాదాసి వెంకయ్యను సన్మానిస్తున్న మండల కన్వీనర్ వెంకట్రావు



బత్తుల అశోక్ రెడ్డిని సన్మానిస్తున్న వెంకట్రావు పార్టీ నేతలు

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు సీఈసీ మెంబర్‌గా మాజీ పీడీసీసీబీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, ఎస్ఈసీ మెంబర్‌గా పార్టీ రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌రెడ్డిలను నియమించారు. వీరిని మండల పార్టీ అధ్యక్షుడు మసనం వెంకటరావు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. వీరిద్దరి సహకారంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు కార్యకర్తలు, అభినందనలు తెలియజేశారు.

రోజురోజుకీ తగ్గుతున్న పొగాకు ధరలు

టంగుటూరు: రోజురోజుకీ తగ్గుతున్న పొగాకు గరిష్ట ధరలు చూసి రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజుల క్రితం గరిష్ట రూ. 346 కొనుగొలు చేసిన వ్యాపారులు, వాటిని దిగజారుస్తూ రూ. 316 కొనుగొలు చేశారు. వాస్తవానికి ఒక రైతు వేలం కేంద్రానికి ఒక పొలంలో సాగు చేసిన శీతల గిడ్డంగిలో నిల్వ ఉంచిన 10 హై గ్రేడు పొగాకు బేళ్లను తీసుకోని రాగా 5 పొగాకు బేళ్లు రూ. 315, మరో 5 రూ.314 కొనుగోలు చేయటంలో ఆంతర్యం ఏంటని తోటి రైతులు చర్చించుకుంటున్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గరిష్ట ధర రూ. 316కు కొనుగోలు చేశారు. వేలం కేంద్రానికి టంగుటూరు, జరుగుమల్లి, సాదువారిపాలెం, వావిలేటిపాడు గ్రామానికి చెందిన రైతులు వేలానికి 1137 బేళ్లను వేలాని తీసుకురాగా వాటిలో 956 కొనుగోలు జరిగగా, 181 పొగాకు బేళ్ల తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 316 కాగా, కనిష్ట ధర రూ. 90 పలకగా, సరాసరి రూ. 262. 94 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 42 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.



వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

రెండు హెక్టార్లు మాత్రమే నర్సరీ వేయాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

పొన్నలూరు: ఒక రైతు గరిష్టంగా రెండు హెక్టార్లు మాత్రమే నర్సరీ వేయవలెనని వేలం నిర్వహణాధికారి కిరణ్ తెలిపారు. కందుకూరు బోర్డు పరిధిలోని ఉప్పలదిన్నె గ్రామంలో కమర్షియల్ పొగాకు నర్సరీలను సాగు చేసే రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడి పెట్టి ప్రతి రైతు బోర్డు వద్దకు వచ్చి తమ పేరును రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఒక ఎకరానికి రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200 అని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్ సూర్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

టంగుటూరు: అడిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని ఉపాధి హామీ పథక పీడీ జోసఫ్‌కుమార్ అన్నారు. మండలంలోని వల్లూరు గ్రామంలో జరుగుతున్న పనులను శనివారం పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిఉన్న ప్రతి వ్యక్తికి ముఖం, కళ్ల ఆధార్‌తో అనుసంధానం చేసి జాబ్ కార్డుకి లింక్ చేయాలని వివరించారు. అనంతరం ఉపాధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



ఆధార్‌తో అనుసంధానం చేసే ప్రక్రియను పరిశీలిస్తున్న పీడీ

పొగాకు నర్సరీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లు

కొండపి: పొగాకు నర్సరీ ఏర్పాటు చేసే రైతులు ఒక ఎకరానికి రూ.200 నగదు చెల్లించి పొగాకు బోర్డులో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని బోర్డు అధికారి సునీల్ కుమార్ అన్నారు. శనివారం బోర్డు పరిధిలోని పెరిదేపి గ్రామంలో ఎఫ్‌సీవి పొగాకునారు మళ్ల పెంపకం, నియంత్రణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ 2025–26 పంట కాలానికి 142 మిలియన్ కేజీలను ఉత్పత్తిని రాష్ట్రానికి అనుమతించినట్లు తెలిపారు. పొగాకు పంట నియంత్రణలో భాగంగా నర్సరీ దశ నుంచి అన్ని నియమ నిబంధనలు అమలుపరచడానికి బోర్డు అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ గాయత్రి, టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

ట్రంప్ టారిఫ్స్‌పై మోదీ మౌనం తీవ్ర నష్టం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆంజనేయులు

కొండపి: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన వాణిజ్య యుద్ధం వ్యవసాయ, పారిశ్రామిక రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెడుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు అన్నారు. ట్రంప్ ప్రభుత్వం విధించిన టారిఫ్ టెర్రరిజానికి వ్యతిరేకంగా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కార్యకర్తలు కరపత్రాలు పంచి, అమెరికా వాణిజ్య సుంకాల వల్ల దేశానికి జరిగే నష్టం పై ప్రజలకు అవగాహనా కల్పించారు. అమెరికా అధిపత్యానికి వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం నిలబడాలని, అందుకు ప్రజలు మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కేజీ మస్తాన్, మండల కార్యదర్శి మల్లెల కొండయ్య, పెద్ద పేతురు, నిర్మల, మాధవి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీతో రైతులకు మేలు

కొండపి: జీఎస్టీ తగ్గించడం వలన రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని మండల వ్యవసాయ అధికారి మాల్యాద్రి అన్నారు. శనివారం మండలంలోని వెన్నూరు గ్రామంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ట్రాక్టర్స్ వ్యవసాయ పరికరాలు డ్రిప్ ఇరిగేషన్ స్ప్రింకర్స్ మీద జీఎస్టీ 12 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గాయని సూచించారు. దీనివలన రైతులు తగిన భారం నుంచి విముక్తి పొందారని తెలిపారు. అనంతరం గ్రామంలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ కుమార్ వీఏఏ లు లింగారావు,బుజ్జి,జ్యోత్స్న, రైతులు పాల్గొన్నారు

30 యాక్టుని రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకయ్య

కందుకూరు: కరేడు పంచాయతీలో పోలీసులు అమలు చేస్తున్న 30 యాక్టును వెంటనే రద్దు చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు, ఏఐకేఎస్ జాతీయ ప్రధానకార్యదర్శి రావుల వెంకయ్య డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన నియోజకవర్గ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ భూముల పట్ల సొంత రైతులకు స్వేచ్ఛ లేని విధంగా కూటమి ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కరేడు గ్రామంలో 30 యాక్టు అమలు చేయడం వల్ల గ్రామంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, బయట ప్రదేశాల్లో ఉండే తమ బంధువులు సైతం గ్రామాల్లోకి రానీయకుండా పోలీసులు అడ్డుకోవడం సరైంది కాదన్నారు. కోర్టు ప్రభుత్వానికి, పోలీసులకు ఎన్ని చివాట్లు పెట్టినా వారి పద్ధతి మారకపోవడం సిగ్గుచేటన్నారు. గ్రామసభలో ఇండోసోల్ కంపెనీ భూసేకరణకు వ్యతిరేకంగా రైతులు ఏకగ్రీవంగా తీర్మానం చేసినా పోలీసులను అడ్డుపెట్టుకుని బలవంతపు భూసేకరణ చేయడం సరైన విధానం కాదన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి బీ సురేష్‌బాబు, నాయకులు ఆనందమోహన్, మురళి, నర్సయ్య, దుర్గాప్రసాద్, ఉప్పుటూరి మాధవరావు, కెమురళి తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లైయింట్ ప్రకాశం జిల్లా, ఒంగోలు నగరం, డోరు నెం. 58–5–5, నాగార్జునా సదన్, సంతపేట నివాసి అయిన **పాలూరు రామిరెడ్డి** గారి కుమారుడు **పాలూరు చంద్రశేఖర రెడ్డి** అనువారు నాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మంది ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా..

ఈ దిగువ చూపిన షెడ్యూలు దాఖలా ఆస్తులు నా క్లయింటు తల్లిదండ్రుల ద్వారా సంపాదించబడి వారి మరణాంతరము నా క్లయింటుకు మరియు నా క్లయింటు యొక్క ముగ్గురు తమ్ముళ్లు అయిన **శ్రీనివాస రెడ్డి, రవినాథ రెడ్డి** మరియు **లింగారెడ్డి**లకు వారసత్వరిత్యా సంక్రమించిన దరిమిలా నలుగురు కలసి మూజువాణీగా, విభజించుకోకుండా నాలుగు భాగములుగా చేసుకోని, ఎవరికి వచ్చిన వాటాలను వారు గ్రామ రెవిన్యు రికార్డులలో చేర్చుకొని అనుభవించుచున్నారు. తదుపరి నా క్లయింటు పేరిటకి పెద్దచెర్లోపల్లి గ్రామ రికార్డులలో చేర్చబడిన రెండు ఐటముల ఆస్తిని నా క్లయింటు కుమారుడు అయిన **శ్రీనివాస శ్రీకాంత్**పేరిటకి దఖలు దస్తావేజు ద్వారా రిజిష్టరు చేసి స్వాధీనం చేసి యున్నారు. అదేవిధముగా **నా క్లయింటు యొక్క ముగ్గురు తమ్ముళ్ళు కూడా వారికి వచ్చిన వాటాలను వారి యొక్క భార్యల పేరిటకి దఖలు దస్తావేజులు ద్వారా రిజిష్టరు చేసి వారి భార్యలకు స్వాధీనం చేసి యున్నారు. నా క్లయింటు యొక్క మూడవ తమ్ముడు అయిన పాలూరి లింగారెడ్డి భార్యకు దఖలు దస్తావేజులు ద్వారా రాబడిన ఈ దిగువ చూపబడిన 2 ఐటములలో సమిష్టిన 1/4 వ వంతు భాగములను నా క్లయింటుకు అమ్మి కనిగిరి రిజిష్టారు ఆఫీసులో తేది: 09.08.2021 న డాక్యుమెంటు నెం. 6751/2021 రు నా క్లయింటు పేరిటకి రిజిష్టరు చేసి స్వాధీనం చేయడమైనది.** తదుపరి సదరు దిగువ చూపిన షెడ్యులు దాఖలా ఆస్థులను పంచుకొని విభజించుకొని గట్లు వేసుకొని వారి వారి కార్యకలాపములను చేసుకొనందులకు గాను నా క్లయింటు కోరినప్పటికి పైన తెలిపిన ఒకటి మరియు రెండవ తమ్ముళ్ళ భార్యలు కలిసిరాని కారణం చేత నా క్లయింటు సహ భాగస్తులందరి పై భాగ పంపిణీ నిమిత్తం కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ఒ.యస్.నెం. 261/2025 ను దాఖలు చేసి మరియు అందులో పైన తెలిపిన భాగ పంపిణీ కోసం ధాఖలు చేసిన దావా విచారణ పూర్తి అయ్యే వరకు ఈ దిగువ చూపిన 2 ఐటములను ఏ భాగస్థులు ప్లాట్లుగా వేసి అమ్ముటగాని మరి ఏ ఇతర కార్యక్రమములు జరగకుండా నిషేధపు ఉత్తర్వులు కోసం మరియొక్క పిటీషను కూడ దాఖలు చేయగా విచారణ నిమిత్తం నిల్వలో ఉన్నది. ఇది **ఇలా ఉండగా నా క్లయింటు యొక్క మూడవ తమ్ముడు అయిన లింగారెడ్డితో పై తెలిపిన శ్రీనివాస రెడ్డి భార్య శారద మరియు రవినాథరెడ్డి భార్య పద్మజలు చేతులు కలిపి ఈ దిగువ చూపిన 2 ఐటములలోని ముళ్ళపొదలను తొలిగించి ప్లాట్లుగా విభజించి ఇతరులకు అమ్ముటకు ప్రయత్నములు జరుగుచున్నవని నా క్లయింటుకు రూఢిగా తెలియవచ్చినది.** పైన తెలిపిన దావా నిల్వలో ఉన్నంత కాలము ఈ దిగువ చూపిన షెడ్యూలు దాఖలా 2 ఐటములలో ఎలాంటి విక్రయములు గాని, అగ్రిమెంటులు కాని, మరియు తాకట్లు వగైరాలు చేసిన అవి చట్టరిత్యా చెల్లనేరవు మరియు సదరు వ్యక్తులపై నా క్లయింటు సివిలు మరియు క్రిమినల్ చర్యలు చట్టపరంగా తీసుకోగలడని మరియు నా క్లయింటు యొక్క సర్వసంపూర్ణ హక్కులను బద్ధపరచమని ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయుడమైనది.

షెడ్యూలు : ఐటం నెం. 1 ప్రకాశం జిల్లా – మార్కాపురం రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ – పెద్దచెర్లోపల్లి మండలము – బొమ్మలాటపల్లి @ పెద్దచెర్లోపల్లి పంచాయితి పరిధి – సర్వే నెం. 125,126,126/3 వెరసి పూర్తి విస్తీర్ణము – ఎ. 4.16¼ సెంట్లు మెట్ట భూమి ఏక ప్రదేశం గా గల భూమికి **హద్దులు: తూర్పు** : ఇన్నమూరి వెంకటేశ్వర్ల గారి భూమి మరియు రోడ్డు. **దక్షిణం** : ఇన్నమూరి వెంకటేశ్వర్ల గారి భూమి మరియు రోడ్డు **పడమర** : మూలె పుల్లయ్య, ఇండేల మాలకొండయ్య వగైరాల భూమి **ఉత్తరం**: ఇన్నమూరి వెంకటేశ్వర్లు వగైరాల భూమి మరియు బావి

ఐటం నెం. 2 : Ditto: సర్వే నెం. 118/1 పూర్తి విస్తీర్ణము ఎ.3.18 సెంట్లు మెట్ట భూమిలో పైకి ఎ.0.60 సెంట్లు భూమికి **హద్దులు: తూర్పు** : గోపవరపు పెద్ద చెన్నయ్య గారి భూమి. **దక్షిణం** : కల్లూరి కొండయ్య గారి భూమి **పడమర** : మూలె నంగయ్య గారి భూమి **ఉత్తరం** : గోపవరపు మునలయ్య వగైరాల భూమి

స్థలం : ఒంగోలు
తేది : 04.10.2025

ఇట్లు : కాసు అంజి రెడ్డి, అడ్వొకేట్, ఒంగోలు. Cell No. 9440591544.